సాక్షి
అనకాపల్లి
గురువారం । 15 । మే । 2025

విశాఖ జోన్, రాయగడ డివిజన్ అంబ్రెల్లా వర్క్స్‌కి రూ.170 కోట్లు మాత్రమే..

రాయగడ డివిజన్‌కు ప్రత్యేకంగా రూ.110 కోట్లు కేటాయింపు



విశాఖ జోన్‌పై సవతి ప్రేమ!

కన్సాలిడేటెడ్ బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు

సాక్షి, విశాఖపట్నం : కొబ్బరికాయ కొట్టేశాం.. కార్యాలయాలు కట్టేయండి అన్నట్లుగా మారింది విశాఖ రైల్వే జోన్‌పై ప్రభుత్వ వైఖరి. ప్రచార ఆర్భాటం.. ఆపై శంకుస్థాపన.. భూమి చదును.. ప్రజెంటేషన్లు.. గ్రాఫిక్స్‌లోనే హడావుడి కనిపిస్తుందే తప్ప.. క్షేత్రస్థాయిలో మాత్రం అడుగు కూడా కదలడం లేదన్న విషయం నిధుల కేటాయింపులోనే స్పష్టమవుతోంది. 2025–26 బడ్జెట్‌కు అనుబంధంగా రైల్వే కేటాయింపులకు సంబంధించిన కన్సాలిడేటెడ్ బడ్జెట్‌లో దక్షిణ కోస్తా రైల్వే జోన్‌పై సవతి ప్రేమ మాత్రమే కనిపిస్తోంది. విశాఖ రైల్వే జోన్‌తో పాటు దానికి అనుబంధంగా ఏర్పాటవుతున్న రాయగడ డివిజన్ అంబ్రెల్లా వర్క్స్‌కు కలిపి కేవలం రూ.170 కోట్లు మాత్రమే కేటాయింపులు చేయడం సర్వత్రా విస్మయానికి గురిచేస్తోంది. రాయగడ డివిజన్ పనులకు మాత్రం ప్రత్యేకంగా మరో రూ.110 కోట్లు కేటాయించడం మరింత బలాన్ని చేకూర్చుతోంది. కీలకమైన జోన్‌కు పప్పుబెల్లాలు ఇచ్చి.. రాయగడ డివిజన్‌కు మాత్రం భారీగా నిధులు అందించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దబ్లింగ్ పనులు.. కొత్త లైన్లకు నిధులు

- **జోన్‌కు అన్యాయం చేస్తున్న రైల్వే మంత్రిత్వ శాఖ మిగిలిన విషయాల్లో కొంతమేర కేటాయింపులు చేయడం ఉపశమనం కలిగించే అంశం. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పనులకు ఈ బడ్జెట్‌లో కొంత మేర నిధులు** కేటాయించడం శుభపరిణామం. కన్సాలిడేటెడ్ బడ్జెట్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో కేటాయింపులిలా ఉన్నాయి.
- ఓర్ ఎక్స్ఛేంజ్ కాంప్లెక్స్(ఓఈసీ) నుంచి ఉత్తర సింహాచలం వరకు 5.22 కి.మీ మేర డబ్లింగ్ పనులకు రూ.81.22 కోట్లు.
- పెందుర్తి నుంచి ఉత్తర సింహాచలం మధ్యలో సింహాచలం వద్ద సర్ఫేస్ క్రాసింగ్ లేకుండా చేసేందుకు ఫ్లైఓవర్ నిర్మాణం కోసం రూ.183.65 కోట్లు
- దువ్వాడ నుంచి ఉత్తర సింహాచలం వరకు 20.543 కిలోమీటర్ల మేర 3, 4వ లైన్ల నిర్మాణం కోసం రూ.302.25 కోట్లు.
- వడ్లపూడి జంక్షన్‌ను అనుసంధానిస్తూ గంగవరం పోర్టు నుంచి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ వరకూ టై లైన్ మాదిరిగా 12.04 కి.మీ మేర 3, 4వ లైన్ల నిర్మాణానికి రూ.154.28 కోట్లు.
- విశాఖపట్నం నుంచి గోపాలపట్నం వరకు 15.31 కి.మీ మేర థర్డ్, ఫోర్త్ లైన్ల నిర్మాణానికి రూ.159.47 కోట్లు.
- ఉత్తర సింహాచలం నుంచి గోపాలపట్నం వరకు 2.64 కి.మీ మేర థర్డ్, ఫోర్త్ లైన్ల నిర్మాణానికి రూ.129.45 కోట్లు.
- పలాస–విశాఖపట్నం–దువ్వాడ(బి రూట్)లో ట్రాక్ పునరుద్ధరణ పనుల కోసం రూ.15 కోట్లు.
- ఉత్తర సింహాచలం నుంచి గోపాలపట్నం వరకు 2.07 కి.మీ మేర బైపాస్ డబ్లింగ్ పనులకు రూ.25.93 కోట్లు.
- విశాఖపట్నం కాంప్లెక్స్ ఏరియాలో ఆటో సిగ్నలింగ్ వ్యవస్థ కోసం రూ.43.07 కోట్లు.



భూమి చదును పనులకే పరిమితం

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు శంకుస్థాపన జరిగి నాలుగు నెలలు.. టెండర్లు ఖరారు చేసి ఐదు నెలలు పూర్తయినా.. ఇంకా భూమి చదును పనులకే పరిమితమైంది. నిధుల మంజూరులో జాప్యం జరుగుతుండటం వల్లనే పనుల ప్రక్రియ అంతంతమాత్రంగానే సాగుతోంది. 2025–26 బడ్జెట్‌లో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు ఒక్క రూపాయి విదిలించని రైల్వే మంత్రిత్వ శాఖ తాజాగా రైల్వే కన్సాలిడేటెడ్ బడ్జెట్‌లోనూ మొండి చెయ్యి చూపించింది.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే..!

జోన్‌కు శంకుస్థాపన చేసేశామంటూ పచ్చపత్రికల్లోనూ, సోషల్ మీడియాల్లోనూ భారీగా ప్రచారం చేసుకున్న కూటమి ప్రభుత్వం.. జోన్ ప్రధాన కార్యాలయాల నిర్మాణం మాత్రం తమకు అవసరం లేదన్నట్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఫలితంగా కేంద్ర ప్రభుత్వం కూడా వైజాగ్ జోన్ కార్యకలాపాలు ఇప్పట్లో ప్రారంభించకపోయినా ఫర్వాలేదన్నట్లుగా భావిస్తోంది. అందుకే దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను పక్కనపెట్టి రాయగడ డివిజన్ నిర్మాణానికే పెద్దపీట వేస్తూ ఉత్తరాంధ్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోంది. అయినా కూటమి ఎంపీలు నోరు మెదపకపోవడం దురదృష్టకరం.

ప్రజల భద్రతకు కొత్త దిక్సూచి

సేఫ్ స్టే మొబైల్ యాప్ లోగో

'సేఫ్ స్టే' యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన జిల్లా పోలీసులు

- హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్‌హౌసుల్లో అతిథుల వివరాల నమోదు
- నేర చరితులు, అనుమానితులుంటే ఈ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం
- ప్రస్తుతం జిల్లాలో 79 చోట్ల యాప్ డౌన్‌లోడ్
- దశలవారీగా అన్ని పర్యాటక కేంద్రాల్లోనూ అందుబాటులోకి..

అనకాపల్లి: అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచడానికి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పౌరులను రక్షించడానికి అనకాపల్లి పోలీసులు 'సేఫ్ స్టే' యాప్‌ను ప్రారంభించారు. హోటళ్లు, లాడ్జీలు, అతిథి గృహాలలో బస చేసే అతిథుల వివరాలను.. క్రిమినల్స్ వివరాల డేటాబేస్‌తో సరిపోల్చి నేరస్తులను గుర్తించేందుకు ఈ యాప్ ఉపయోగపడనుంది. జిల్లావ్యాప్తంగా ఉన్న లాడ్జీలు, హోటళ్లలో ఈ యాప్‌ను పొందుపరుస్తున్నారు. అక్కడ ఎవరు చెక్ ఇన్ చేసినా వారి వివరాలను ఈ ఆన్‌లైన్ యాప్‌లో పొందుపరిస్తే, వెంటనే అవి పోలీసులకు చేరతాయి. నేరస్తులు, అనుమానాస్పద వ్యక్తుల వివరాలతో సరిపోలితే



ఆన్‌లైన్‌లో యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

తక్షణమే పోలీసులు వారిని అరెస్ట్ చేసేందుకు వీలుంటుంది.

ఈనెల 8 నుంచి అమల్లోకి..

నేరస్తులను నిలువరించేందుకు సాధారణంగా చెక్ పోస్టుల వద్ద తనిఖీలు చేసి అనుమానముంటే అదుపులోకి తీసుకుంటారు. అదే విధంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి మన ప్రాంతంలో స్టే చేసే వారి వివరాలను సైతం విశ్లేషిస్తే అనుమానితులను ముందే కట్టడి చేయవచ్చు.. లేదా నేరం జరిగాక త్వరగా నిందితులను గుర్తించవచ్చు. ఈ ఆలోచన నుంచి పుట్టిందే సేఫ్ స్టే యాప్. ఈనెల 8న జిల్లా పోలీస్ శాఖ ఈ మొబైల్ యాప్‌ను ఆవిష్కరించింది. ఈ యాప్‌ను జిల్లాలోని ప్రధానమైన హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్‌హౌసుల్లో డౌన్‌లోడ్ చేయించారు. మిగతావారు కూడా ఈ యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఇలా గుర్తిస్తారు..

సందర్శకుల వివరాలను **ఆధార్ కార్డు ద్వారా** 'సేఫ్ స్టే' మొబైల్ **యాప్‌లో నమోదు** చేయాలి. వారిలో నింది**తులు ఎవరైనా ఉన్న**ట్లయితే పోలీస్ కంట్రోల్ **రూమ్‌కు పూర్తి వివ**రాలు తెలుస్తాయి. తక్షణమే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందిస్తారు. అక్కడకు పోలీసులు వెళ్లి అనుమానితుల పూర్తి వివరాలు తెలుసుకుంటారు. ఇది నేరాలను నియంత్రించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. మొదటి దశగా జిల్లాలో 79 హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. దశలవారీగా మిగిలిన చిన్నచిన్న హోటళ్లలోనూ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామని పోలీస్ శాఖ చెబుతోంది.

ప్రజల భద్రత మరింత పటిష్టం చేసేందుకే..

'సేఫ్ స్టే' యాప్ ద్వారా నేరస్తులను ముందుగానే గుర్తించవచ్చు. నేరాలను తగ్గించవచ్చు. ప్రజల భద్రతకు పూర్తి భరోసా కల్పించడానికి వీలుంటుంది. ఈ యాప్ ద్వారా అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంటుంది. దశలవారీగా జిల్లాలో యాప్ డౌన్‌లోడ్ చేయిస్తాం. త్వరలో రెండో దశలో పూర్తిస్థాయిలో అమలు చేస్తాం. – తుహిన్ సిన్హా, ఎస్పీ

అల్లూరి పార్కు అభివృద్ధికి ప్రణాళిక

- త్వరలో పనులు ప్రారంభం
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు



పార్కులో మౌలిక సదుపాయలు కల్పించాలని తెలుపుతున్న స్పీకర్ అయ్యన్న

గొలుగొండ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఆయన బుధవారం పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్కు అభివృద్ధికి సహకరించమని ఇప్పటి వరకు 10 మంది ఎంపీలతో మాట్లాడానని, విజయనగరం ఎంపీ అప్పలనాయుడు రూ.10 లక్షలు, నెల్లూరి ఎంపీ మస్తాన్‌రావు రూ.10 లక్షలు ఇవ్వగా మరో 8 మంది ఎంపీలు త్వరలో నిధులు కేటాయించనున్నారని తెలిపారు. పార్కులో సోలార్ సిస్టమ్, భోజనశాల, మరుగుదొడ్లు, పార్కు చుట్టూ లైటింగ్, తాగునీరు ఏర్పాటు చేసి, శిథిలమైన భవనాలకు మరమ్మతులు చేస్తున్నట్లు చెప్పారు. ఏపీ టూరిజం నుంచి నిధులు కూడా తీసుకువస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీ టూరిజం అధికారులు విజయభాస్కరరెడ్డి, సీతారాం, సత్యనారాయణ, టూరిజం మేనేజర్ అప్పలనాయుడు, నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, రూరల్ సీఐ రేవతమ్మ పాల్గొన్నారు.

వుషు స్టేట్ టోర్నమెంట్‌లో 12 మెడల్స్



రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

నర్సీపట్నం: రాష్ట్ర స్థాయి వుషు టోర్నమెంట్‌లో నింజాస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు 12 పతకాలు సాధించారు. కర్నూల్ జిల్లా శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరిగిన స్టేట్ వుషు చాంపియన్‌షిప్ పోటీల్లో వీరు పాల్గొన్నారు. అక్షయ రాణి–సీనియర్ వుమెన్.. శ్రీరామ్ నిహాల్, పి.ప్రణీత–సబ్ జూనియర్.. వై.దివాకర్ మెన్ సీనియర్ విభాగాల్లో గోల్డ్ మెడల్స్ సాధించారు. జి.సాయి ఉమెన్ సీనియర్, యు.రవికుమార్ సీనియర్ మెన్ విభాగంలో సిల్వర్ మెడల్స్ సాధించారు. సబ్ జూనియర్ బాయ్స్ విభాగంలో టి.జగదీష్, వై.సాత్విక్, ఎం.దుర్గాప్రసాద్, ఎం.హర్ష, ఎం.సాయి సందీప్, కె.విజయ్ కుమార్ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. కోచ్ ప్రియాంక్ ఆధ్వర్యంలో క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాకారులను మోహన్ ముత్యాల, నేషనల్ రిఫరీ వెంకటేష్ అభినందించారు. 600 మందికి పైగా పాల్గొన్న క్రీడాకారుల్లో నింజాస్ క్రీడాకారులు పోటీ పడి మెడల్స్ సాధించారన్నారు.

'శుభం' సినీ యూనిట్ సందడి

అనకాపల్లి టౌన్: చిన్న సినిమాలను ఆదరించి, విజయవంతం చేయాలని శుభం సినిమా డైరెక్టర్ కాండ్రేగుల ప్రవీణ్ కోరారు. పట్టణంలోని సత్యనారాయణ థియేటర్‌లో శుభం సినిమా యూనిట్ బుధవారం మ్యాట్నీ సమయంలో సందడి చేసింది. ప్రేక్షకులతో పాటు కొద్దిసేపు సినిమాని వీక్షించి వారితో మాట్లాడి సినిమాపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విజయోత్సవ కేక్‌ను కట్ చేశారు. సినిమా హీరోలు గవిరెడ్డి శ్రీనివాస్, హర్షిత్, చరణ్, హీరోయిన్లు శ్రావణి, షాలిని, శ్రేయ తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణ థియేటర్‌లో శుభం సినిమా యూనిట్

రచ్చకెక్కిన విభేదాలు

- దేవరాపల్లి మండల కమిటీ ఎన్నికలో భగ్గుమన్న అసమ్మతి సెగలు
- ఎమ్మెల్యే బండారు ముందే కుమ్ములాటకు దిగిన కార్యకర్తలు
- వలస నేతలపై పార్టీలో పాత కాపుల గుర్రు



ఎమ్మెల్యే బండారు ఎదుటే పరస్పర దూషణలకు దిగిన టీడీపీ నేతలు



వాగ్వివాదానికి దిగిన బోయిలకింతాడ నేతలపై ఎమ్మెల్యే బండారు ఆగ్రహం

దేవరాపల్లి: మండల టీడీపీ నేతలు వర్గ విభేదాలతో కుమ్ములాటకు దిగి రచ్చకెక్కారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సాక్షిగా పరస్పర దూషణలతో బాహాబాహీకి దిగారు. దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహం వద్ద బుధవారం జరిగిన టీడీపీ సంస్థాగత ఎన్నిక వేదికగా కార్యకర్తలు గొడవ పడ్డారు. దీంతో ఈ సమావేశం ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. స్థానిక ఎస్ఐ టి.మల్లేశ్వరరావు, సీఐ పైడపునాయుడు దగ్గరుండి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. పాత టీడీపీ నేతలు, సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన వలస నేతల మధ్య ఆధిపత్య పోరు ఈ వివాదానికి కారణంగా చెబుతున్నారు. తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు సంస్థాగత ఎన్నికల ప్రక్రియను వేదికగా చేసుకొని ఎమ్మెల్యే సమక్షంలో ఇరు వర్గాలు వాగ్వివాదానికి దిగారు. తొలి నుంచీ పార్టీని నమ్ముకున్న కార్యకర్తలు కొందరు ఎమ్మెల్యే ఎదుటే తమ అసంతృప్తిని వెళ్లగక్కారు. దీంతో ఎమ్మెల్యే సహనం కోల్పోయి కొన్ని గ్రామాల నాయకులపై చిందులు తొక్కారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే సహా పార్టీ పరిశీలకుడి ముందు కార్యకర్తలు బాహాబాహీకి దిగడానికి సిద్ధపడగా అక్కడే ఉన్న స్థానిక ఎస్ఐ మల్లేశ్వరరావు, సీఐ పైడపునాయుడు ఇతర పోలీస్ సిబ్బంది అడ్డుకొని సర్ది చెప్పారు.

ఎమ్మెల్యేతో కలిగొట్ల నేతల వాగ్వాదం

ప్రధాన కార్యదర్శిగా పదవి పేరు ప్రకటన సమయంలో ఒకే వ్యక్తికి పదవులు కట్టబెట్టడంపై ఎమ్మెల్యేతో కలిగొట్ల గ్రామానికి చెందిన కొందరు నేతలు వాదనకు దిగారు. ఈ సమయంలో సహనం కోల్పోయిన ఎమ్మెల్యే ఎదురించే వారిని తాను లెక్క చేయనని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ ఆగ్రహించడంతో పార్టీ శ్రేణులు తీవ్ర విస్మయానికి గురయ్యారు. పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగు దేశం జెండాను మోసిన వారిని కాదని, వలస నేతలకు ప్రాధాన్యత ఇస్తున్న ఎమ్మెల్యే తీరుపై టీడీపీ నేతలు కొందరు గుర్రుగా ఉన్నారు. కుమ్ములాటలు, దూషణల నడుమ టీడీపీ మండల అధ్యక్షుడిగా ఎ.కొత్తపల్లి పెద్దాడ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా కలిగొట్ల దొగ్గ దేముడునాయుడు పేర్లను ఎమ్మెల్యే, పార్టీ పరిశీలకుడు ప్రకటించారు. వర్గ విభేదాల నేపథ్యంలో రైవాడ, బోయిలకింతాడ, మారేపల్లి, కాశీపురం గ్రామ కమిటీ ఎన్నిక ప్రక్రియను వాయిదా వేశారు.

ఉగ్రదాడులను ఎదుర్కొందామిలా..

అనకాపల్లిలో మాక్ డ్రిల్



గ్రీన్‌హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో మాక్ డ్రిల్



క్షతగాత్రులను భవనం లోనుంచి బయటకు తీసుకొస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

అనకాపల్లి: ఉగ్రదాడులు, విపత్తులను ఎదుర్కోవడంపై అవగాహన కల్పించేందుకు అనకాపల్లిలో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. పూడిమడక రోడ్డులోని గ్రీన్ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో శేషాద్రి బ్లాక్ వద్ద ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, వైద్యారోగ్య శాఖలు పాల్గొన్నాయి. యుద్ధం వల్ల బాంబులు పడి, గ్యాస్ లీక్, షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటే ఎలా బయటపడాలో వివరించారు. బాంబులు, ఇతర పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసే విధానాన్ని కూడా వివరించారు. పై అంతస్తులో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అక్కడికి అగ్నిమాపక సిబ్బంది చేరుకోవడం, క్షతగాత్రులను అక్కడి నుంచి కిందకు దించడం, వారికి వైద్య సహాయాన్ని అందించడం, హుటాహుటిన అంబులెన్సు ద్వారా ఆసుపత్రికి తరలించడం, సహాయ చర్యలు చేపట్టడం వంటి అంశాలను ప్రత్యక్షంగా డ్రిల్ చేసి చూపించారు. ప్రకృతి వైపరీత్యాలతోపాటు, మానవ ప్రేరేపిత ప్రమాదాలను సైతం ఎదుర్కొనే విధానాన్ని వివరించి, అధికారులు తమ సన్నద్ధతను తెలియజేశారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అదే మనను విపత్కర పరిస్థితుల నుంచి కాపాడుతుందని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు అన్నారు. మాక్‌డ్రిల్ అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంత పెద్ద జనాభా గల అపార్ట్‌మెంట్లలో విపత్తుల నుంచి ఎలా బయటపడాలో వివరించారన్నారు. ఇన్‌చార్జి ఆర్డీవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో శాంతిప్రభ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్.వెంకటరమణ, ఎన్డీఆర్ఎఫ్. ఇన్‌స్పెక్టర్ సుశాంత్ కుమార్, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

బెండ రైతుకు తాత్కాలిక రైతు బజారు కార్డు

బాధితుడిని కలిసిన మాడుగుల మార్కెట్ కమిటీ సెక్రటరీ బంగార్రాజు



బెండ రైతు పైడితల్లితో మాట్లాడుతున్న మాడుగుల మార్కెట్ కమిటీ సెక్రటరీ బంగార్రాజు

దేవరాపల్లి: దేవరాపల్లి హోల్‌సేల్ కాయగూరల మార్కెట్లో కనీస గిట్టుబాటు ధర లభించక మనస్తాపంతో బెండకాయలను పారబోసిన చేనుల పాలెం రైతు రొంగలి పైడితల్లికి కాస్తంత ఊరట లభించింది. వ్యవసాయశాఖ ఏడీఏ వి.రవీంద్రనాథ్ ఆదేశాలతో మాడుగుల వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ బంగార్రాజు బుధవారం చేనుల పాలెం వెళ్లి బాధిత రైతులను కలిశారు. ఈ సందర్భంగా తన కాయగూరలను రైతు బజారులో విక్రయించుకునేందుకు వీలుగా తాత్కాలిక రైతు బజారు కార్డును అందజేశారు. 15 కేజీల కేటు బెండకాయలను దళారీ వ్యాపారులు కేవలం రూ.30కు అడగటంతో కనీసం మార్కెట్‌కు తీసుకువచ్చేందుకు అయిన రవాణా చార్జీలు సైతం వచ్చే పరిస్థితి లేక పైడితల్లి ఆగ్రహంతో ఆవేదనతో రోడ్డుపైనే బెండ కాయలను పారబోసిన విషయం తెలిసిందే.

పాలిసెట్‌లో 2, 8 ర్యాంకుల మనవే..

ఉత్తమ ఫలితాలు సాధించిన జిల్లా విద్యార్థులు

మురళీనగర్ (విశాఖ): పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన పాలి సెట్‌లో విశాఖ విద్యార్థులు అదరగొట్టారు. సాంకేతిక విద్యాశాఖ బుధవారం విడుదల చేసిన పాలిసెట్ ఫలితాల్లో విశాఖ విద్యార్థులు 96.11 శాతం ఫలితాలు సాధించారు. రాష్ట్ర స్థాయిలో మొదటి పది స్థానాల్లో 2, 8 ర్యాంకులను దక్కించుకున్నారు. జిల్లాకు చెందిన బాలినేని కల్యాణ్‌రామ్ 120 మార్కులతో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు, చింతాడ చౌహాన్ 120 మార్కులతో 8వ ర్యాంకు సాధించారు.

సైన్స్ రీసెర్చ్ చేస్తా..



పాలిసెట్‌లో 120 మార్కులకు గాను 120 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించాను. ఈ రోజే విడుదలైన ఏపీఆర్జేసీలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు వచ్చింది. పదో తరగతిలో 595 మార్కులు వచ్చాయి. మా స్వస్థలం గుంటూరు కాగా మా నాన్న రాజేంద్రబాబు డీవీసీలో ఉద్యోగం చేస్తున్నారు. సంగివలసలో నివాసం ఉంటున్నాం. మా అమ్మ గృహిణి. ఇంటర్మీడియట్ ఎంపీసీ చదువుతాను. ఐఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేస్తాను. అనంతరం సైన్స్ రీసెర్చ్ చేస్తాను. –బాలినేని కల్యాణ్‌రామ్, 2వ ర్యాంకు

ఇంజినీరింగ్ చేస్తా..



మాది శ్రీకాకుళం జిల్లా ఎల్ఎన్‌పేట మండలం. పాలిసెట్‌లో 120 మార్కులకు గాను 120 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు సాధించాను. పదో తరగతిలో 588 మార్కులు వచ్చాయి. ఇంటర్మీడియట్ ఎంపీసీలో చదువుతాను. ఐఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేసి ఉన్నత ఉద్యోగం సాధిస్తాను. సంఘ సేవ చేయడమే లక్ష్యం. – చింతాడ చౌహాన్, 8వ ర్యాంకు

టి.అర్జాపురం విద్యార్థి ప్రతిభ



రావికమతం: టి.అర్జాపురం గ్రామానికి చెందిన డొంక సాయి లోకేష్ పాలిసెట్–2025లో ప్రతిభ చాటుకున్నాడు. 120కి 109 మార్కులు తెచ్చుకొని రాష్ట్ర స్థాయిలో 1775వ ర్యాంక్ సాధించాడు. ఈ విద్యార్థి పదో తరగతిలో 566 మార్కులతో రాణించాడు. టి.అర్జాపురం క్లస్టర్ సీఆర్పీ గుంటూరు రామారావు సాయి లోకేష్‌కు పాలిసెట్‌లో ఉచిత శిక్షణ ఇచ్చారు.

క్లుప్తంగా

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు



పట్టుబడ్డ నిందితులను చూపిస్తున్న ఎస్ఐ

బుచ్చెయ్యపేట: మండలంలో గల వడ్డాది పోస్టాఫీసులో దొంగతనానికి పాల్పడ్డ ముగ్గురు వ్యక్తులను పట్టుకుని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. గత నెల 17వ తేదీన వడ్డాది పోస్టాఫీసు తాళాలు పగలగొట్టి రూ, 67,855 నగదును గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుపోయారన్నారు. దీనిపై పోస్టాఫీసు బీఎం ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. క్లూస్ టీం, సీసీ ఫుటేజీ, టెక్నాలజీ ఆధారంగా చోరీకి పాల్పడ్డ వడ్డాది ఎస్సీ కాలనీకి చెందిన ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నామన్నారు. ఆ ముగ్గురిలో ఒకరు మైనర్ కాగా మిగిలిన ఇద్దరు 18 ఏళ్ల యువకులన్నారు. మైనర్ బాలుడిని జువైనల్‌కు, ఇద్దరిని రిమాండ్‌కి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. దొంగలను చాకచక్యంగా పట్టుకున్న సిబ్బంది అర్జున్, గణేష్, వెంకట్‌లను ఎస్ఐ అభినందించారు.

నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

డాబాగార్డెన్స్ (విశాఖ): హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంయుక్తంగా బ్యూటీషియన్, హోటల్ మేనేజ్‌మెంట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (నర్సింగ్), ప్రొడక్షన్ మెషీన్ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈమేరకు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ రెండో అంతస్తులో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించే ఈ కోర్సుల్లో చేరేందుకు డిగ్రీ, ఇంటర్, డిప్లమో, ఐటీఐ, పదో తరగతి పూర్తి చేసి 18 నుంచి 28 ఏళ్లలోపు నిరుద్యోగులు అర్హులు. 3 నెలల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటు యూనిఫాం, పుస్తకాలు వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి బీఎస్సీ/డిప్లమో పారామెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయి. వివరాలకు 73370 76665, 72079 53920 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నగ్నంగా దొంగతనానికి యత్నం

ఎంవీపీకాలనీ (విశాఖ): స్థానిక సెక్టార్-6లో మంగళవారం అర్ధరాత్రి ఓ వ్యక్తి నగ్నంగా ఇంట్లోకి చొరబడి దొంగతనానికి ప్రయత్నించాడు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. బి.విశ్వసాయి ఎంవీపీ సెక్టార్-11లోని శ్రీమారుతి నిలయంలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి నగ్నంగా ఇంటి ముందు తిరగడంతో పాటు ఇంట్లోకి చొరబడి దొంగతనం చేసేందుకు ప్రయత్నించాడు. ఇంటి ముందున్న సీసీ టీవీని ధ్వంసం చేశాడు. ఈ ఘటనపై విశ్వసాయి ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోడవరం టీడీపీలో వర్గ పోరు

- ఎమ్మెల్యే రాజు తీరుపై తాతయ్యబాబు, మల్లునాయుడు గుర్రు
- అసమ్మతి నాయకులకు ఎంపీ సీఎం రమేష్ ప్రోత్సాహం!



ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు | బత్తుల తాతయ్యబాబు | గూనూరు మల్లునాయుడు

చోడవరం: నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ప్రధాన నాయకుల మధ్య ఆధిపత్య వర్గపోరు రోజు రోజుకు తీవ్రమవుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర రూరల్ హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు మధ్య ఆధిపత్య పోరు బహిరంగంగానే జరుగుతోంది. ఎమ్మెల్యే రాజుకి అత్యంత సన్నిహితుడు, క్లాస్‌మేట్ అయిన గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు కూడా ఎమ్మెల్యే తీరుపై లోలోపల అసమ్మతితో ఉన్నారు. వాస్తవానికి వీరు ముగ్గురూ గత 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ నుంచి ఎమ్మెల్యే టిక్కెట్టు కోసం ప్రయత్నాలు చేశారు. అయితే అధిష్టానం రాజుకే టిక్కెట్టు ఇవ్వడంతో తాతయ్యబాబు, మల్లునాయుడు అసమ్మతితోనే ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాతయ్యబాబు నేరుగా మంత్రి లోకేష్‌తో సంబంధాలు పెట్టుకోవడంతో పాటు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కోటరీలో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్ష పదవితోపాటు అధికారం వచ్చిన వెంటనే రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా కూడా పదవి దక్కింది. ఈ పరిణామం ఎమ్మెల్యే రాజుకి రుచించలేదు. అధిష్టానం నేరుగా తాతయ్యబాబుకు పదవులు ఇవ్వడంతో ఎమ్మెల్యే అంటీఅంటనట్టుగా ఉన్నారు. నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లు ఉన్న కాపు సామాజికవర్గానికి చెందిన తాతయ్యబాబు తనకంటూ ఒక వర్గాన్ని తయారు చేసుకుంటున్నారు. అన్ని గ్రామాల్లోనూ చాపకింద నీరులా తన వర్గం మరింత బలపడేలా పావులు కదుపుతున్నారు. దీనిని ఏమాత్రం సహించలేకపోతున్న ఎమ్మెల్యే రాజు చెక్‌పెట్టేందుకు తాతయ్యబాబు సొంత మండలమైన బుచ్చెయ్యపేటలోనే వైఎస్సార్‌సీపీ నుంచి వెళ్లిన విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణకు పార్టీలో అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో తాతయ్యబాబుకు సమాచారం లేకుండానే గేదెల సత్యనారాయణతో కలిసి ఎమ్మెల్యే పాల్గొంటుండడంతో తాతయ్యబాబు వర్గానికి ఏమాత్రం నచ్చడం లేదు.

వడ్డాదిలో బయటపడ్డ విభేదాలు

ఇటీవల వడ్డాదిలో పార్టీ సమాశానికి జిల్లా అధ్యక్షుడైన తాతయ్యబాబు ఫొటో లేకుండానే ఫ్లెక్సీ వేయించడంతో ఇరువర్గాల మధ్య పెద్ద గొడవే జరిగింది. ఈ విషయం లోకేష్, చంద్రబాబు వరకూ కూడా తాతయ్యబాబు తీసుకెళ్లి ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు. ఈ గొడవ జరిగిన ఈ నెలరోజుల్లో పార్టీ అధిష్టానం ఏమి చెప్పిందో గానీ తాతయ్యబాబు తన వర్గాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ ఎమ్మెల్యేతో సంబంధం లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలు ఏర్పాటు చేసుకొని ఆయనే ముఖ్య అతిథిగా వెళ్లిపోతుండడంపై ఎమ్మెల్యే మరింత గుర్రుగా ఉన్నారు. బుచ్చెయ్యపేటతో పాటు చోడవరం, రావికమతం, రోలుగుంట మండలాల్లో కూడా వీరిద్దరి వర్గాలు వేర్వేరుగా ఏర్పడ్డాయి. ఈ పరిణామం నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తల్లో తీవ్ర అయోమయాన్ని నింపింది. మరో పక్క మల్లునాయుడు కూడా తన వెలమ సామాజిక వర్గంతో పాటు పార్టీలో తన అనుచరుల వర్గాన్ని తయారు చేసుకుంటున్నారు. ఎమ్మెల్యే రాజుకి చోడవరం పట్టణం వరకూ మల్లునాయుడు కుడి భుజంగా పనిచేస్తున్నారు. ఎమ్మెల్యే పక్కనే ఉంటూనే రెండుసార్లు తనకు ఎమ్మెల్యే టిక్కెట్టు రాకుండా అడ్డుపడి తన స్వలాభం కోసం రాజు చేస్తున్న రాజకీయ చతురతకు ఈసారి చెక్ పెట్టాలని మల్లునాయుడు కూడా గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈయన కూడా బయటకు ఎమ్మెల్యేతో తిరుగుతూ లోలోపల ఎంపీ రమేష్, తాతయ్యబాబులతో సఖ్యతగా ఉంటూ తన వర్గాన్ని బలోపేతం చేసుకునే చర్యలు చేపట్టారు. ఇటీవల పలు పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యేతో సంబంధం లేకుండా వెళ్లడం, చోడవరం పట్టణంలో మరిడిమాంబ పండగను ఎంతో ప్రతిష్టాత్మకంగా మల్లునాయుడే తన భుజాలపైనే వేసుకొని చేసినప్పటికీ ఈ రెండు కార్యక్రమాలకు ఎమ్మెల్యే రాకుండా డుమ్మా కొట్టడం పార్టీలో చర్చనీయాంశమైంది. ఇంకా నాలుగేళ్లు ఉన్నప్పటికీ ఇప్పటి నుంచే అధికార టీడీపీ ప్రధాన నాయకులు మధ్య ఆధిపత్య , వర్గ విభేదాలు మరింత బహిర్గతం కావడంతో తటస్థంగా ఉన్న పార్టీ కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. ఎమ్మెల్యే వ్యతిరేక వర్గానికి ఎంపీ సీఎం రమేష్ లోపాయికారిగా ప్రోత్సాహం అందిస్తున్నారంటూ పార్టీలోనే చర్చ జరుగుతోంది. ఈ వర్గ విభేదాలు రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మాజీ ఎమ్మెల్యే చిట్టినాయుడు భార్య మృతి



గంగాభవాని (ఫైల్)

సాక్షి, పాడేరు: పాడేరు మాజీ ఎమ్మెల్యే, దివంగత కొట్టగుల్లి చిట్టినాయుడు భార్య గంగా భవానీ (70) మంగళవారం రాత్రి కేజీహెచ్‌లో వైద్య సేవలు పొందుతూ మృతి చెందారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మికి గంగాభవాని మాతృమూర్తి. సమాచారం తెలుసుకున్న అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, వైఎస్సార్‌సీపీ నేత చెట్టి వినయ్ సంతాపం వ్యక్తం చేశారు. వారంతా పాడేరులోని గుడివాడ గ్రామానికి చేరుకుని గంగాభవానీ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తదితరులు సంతాపం తెలిపారు. ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయులు, వర్తకులంతా గంగాభవానికి కన్నీటి వీడ్కోలు పలికారు. స్థానిక శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిపారు. సంతాప సూచకంగా మధ్యాహ్నం వరకు పట్టణంలోని వర్తకులు దుకాణాలను మూసివేశారు.



మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని పరామర్శిస్తున్న అరకు ఎంపీ తనూజరాణి, ఎమ్మెల్యే మత్స్యలింగం

12 కిలోల గంజాయి స్వాధీనం

నక్కపల్లి: జాతీయరహదారిపై వేంపాడు టోల్‌ప్లాజా వద్ద తమిళనాడు, బెంగళూరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి నక్కపల్లి పోలీసులు 12 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సీఐ కుమారస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బెంగళూరుకు చెందిన మునివెంకటప్ప అంజనప్ప, తమిళనాడుకు చెందిన కుప్పా ముత్తులు స్కూలు బ్యాగుల్లో గంజాయి తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా పారిపోతుండగా ఎస్ఐ సన్నిబాబు ఆధ్వర్యంలో సిబ్బంది వెంబడించి పట్టుకున్నారన్నారు. వారి వద్ద రూ.50 వేలు విలువగల 12 కిలోల గంజాయి లభించిందన్నారు. గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. అంజనప్పపై గతంలో హత్య కేసు, కుప్పా ముత్తపై గంజాయి కేసు నమోదయిందని తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

నిందితుడిని పట్టుకున్న కానిస్టేబుల్‌కు రివార్డు

కోటవురట్ల : కె.వెంకటాపురంలో 2010లో సంచలనంగా మారిన హత్య కేసులో తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ నరేష్‌ను డీఎస్పీ శ్రీనివాసరావు అభినందించి రివార్డును అందజేశారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలివి. పోలీసు డిపార్ట్‌మెంట్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న పాంగి అప్పారావు 2010లో కె.వెంకటాపురంలో తుపాకీతో ఒకరిపై కాల్పులు జరిపాడు. ఆ ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా ముద్దాయి అప్పారావుపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఆ తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చి సమయం ముగిసినా సరెండర్ కాకుండా తప్పించుకు తిరుగుతుండడంతో అతనిపై నాన్ బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేశారు. ఆంధ్రా ఒడిశా బోర్డర్‌లో అతని కదలికలు ఉన్నట్టు గుర్తించిన కానిస్టేబుల్ నరేష్ సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందజేశాడు. వెంటనే ఎస్ఐ రమేష్ సిబ్బంది కలిసి నిందితుడు పాంగి అప్పారావును పట్టుకుని నర్సీపట్నం కోర్టులో ప్రవేశపెట్టారు. రిమాండ్ విధించడంతో అతనిని విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ కేసులో నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన నరేష్‌కు డిపార్ట్‌మెంట్ తరఫున రివార్డును అందజేశారు. నక్కపల్లి సీఐ ఎల్.రామకృష్ణ, ఎస్ఐ రమేష్ అభినందించారు.



డీఎస్పీ శ్రీనివాసరావు చేతుల మీదుగా రివార్డు స్వీకరిస్తున్న కానిస్టేబుల్ నరేష్

19న దేవరాపల్లి వైస్ ఎంపీపీ ఎన్నిక

దేవరాపల్లి : మండల పరిషత్ వైస్ ఎంపీపీ ఎన్నిక ప్రక్రియను ఈ నెల 19న పకడ్బందీగా నిర్వహించనున్నట్లు స్థానిక ఎంపీడీవో సువర్ణరాజు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఈ నెల 12న షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. ఈ నేపథ్యంలోనే మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులకు, ఎమ్మెల్యే, ఎంపీకు ఇప్పటికే సమాచారం అందించామన్నారు. 19న ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించి చేతులు ఎత్తే పద్ధతిలో వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించి, ఫలితాన్ని వెంటనే ప్రకటిస్తామన్నారు. గతంలో వైస్ ఎంపీపీ-1గా ఎన్నికైన చింతల బుల్లిలక్ష్మి ఇటీవల నిర్వహించిన మండల పరిషత్ అధ్యక్ష ఉప ఎన్నికలో ఎంపీపీగా గెలుపొందారు. దీంతో వైస్ ఎంపీపీ-1 స్థానం ఖాళీ కావడంతో ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. కాగా ఈ ఎన్నికకు ప్రిసైడింగ్ అధికారిగా మండల ప్రత్యేక అధికారి ఎస్.మంజులవాణిని నియమించినట్టు ఎంపీడీవో తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎంపీడీవో సువర్ణరాజు

అచ్యుతాపురం కూడలిలో ట్రాఫిక్ కష్టాలు

- ఫ్లై-ఓవర్ నిర్మాణ పనులతో సమస్యలు
- ప్రత్యామ్నాయ రహదారులు లేక ట్రాఫిక్ ఇక్కట్లు
- అత్యవసర సేవలకు తీవ్ర అంతరాయం



పూడిమడక వైపు వెళ్లే దారి ఒకవైపు మూతబడడంతో నిలిచిపోయిన యలమంచిలి, అనకాపల్లి, గాజువాక నుంచి వచ్చే వాహనాలు



పోలీస్‌స్టేషన్ దారిలో నిలిచిపోయిన భారీ వాహనాలు, కార్మికుల బస్సులు

అచ్యుతాపురం రూరల్ : సెజ్ కర్మాగారాల నుంచి వచ్చే భారీ వాహనాలను అచ్యుతాపురం పాత సినిమా హాల్ పక్క నుంచి పోలీస్‌స్టేషన్‌కి వెళ్లే మార్గంలో మళ్లించడం వల్ల బుధవారం ట్రాఫిక్ జామ్ అయి వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అచ్యుతాపురం కూడలిలో ఫ్లై-ఓవర్ నిర్మించడానికి ఏర్పాటు చేసిన భారీ యంత్రం కారణంగా అటువైపు వాహనాలు రాకపోకలు చేయడానికి వీలుకాలేదు. ట్రాఫిక్ కిలోమీటర్ల మేర నిలిచిపోవడంతో పరిశ్రమలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే కార్మికులు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు.

సరైన ప్రణాళిక లేకుండా...

ఫ్లై-ఓవర్ నిర్మాణంలో నిర్వాహకులకు సరైన అవగాహన లేకపోవడం కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు అంటున్నారు. ట్రాఫిక్‌ని మళ్లించకుండా ఫ్లై-ఓవర్ నిర్మాణం పనులు చేపడితే వచ్చే సమస్యలను గ్రహించలేకపోవడం అధికారులు, నాయకుల తెలివితక్కువ తనంగా భావిస్తున్నారు. ఆ మాత్రం అవగాహన లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం పిచ్చికి పరాకాష్టగా ఉందని ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అత్యవసర సమయాల్లో ఎలా...!

ఆరంభంలోనే ఇంతటి ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటే మున్ముందు మరెన్ని ఇబ్బందులు పడాలోనని జనం వాపోతున్నారు. ఇటువంటి ట్రాఫిక్ సమస్యలు ఎదురైతే అత్యవసరంగా పరిశ్రమల్లో కానీ స్థానిక నివాసాల్లో గానీ అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే అంబులెన్స్‌ల ద్వారా ఆస్పత్రులకు వెళ్లేందుకు కూడా వీలులేనంత ట్రాఫిక్ ఇబ్బంది కలిగింది. ముందస్తు ఆలోచన లేకుండా ప్రజలను ఇబ్బంది పెట్టే అభివృద్ధి కార్యక్రమాల కారణంగా అనేక మంది అమాయక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు అధికారులకు ఫ్లై-ఓవర్ నిర్మాణంలో ట్రాఫిక్‌ని మళ్లించే విధానం సరికాదని తెలిసినప్పటికీ ఏమీ చేయలేని పరిస్థితిలో నోరు మెదపలేకున్నామని అంటున్నారు. కొందరి స్వార్థ పూరిత ఆలోచనల కారణంగా సామాన్య పౌరులు సమస్యల పాలౌతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, నాయకులు మంచి ఆలోచనతో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు ముందుగా ప్రత్యామ్నాయ రహదారులు ఏర్పాటు చేసి వాహనాలను మళ్లించి అనంతరం అవసరమైతే అప్పుడు ఫ్లై-ఓవర్ నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.



యలమంచిలి రహదారిలో నిలిచిపోయిన వాహనాలు

గోవాడ సుగర్స్‌ను ప్రభుత్వం ఆదుకోవాలి

- వచ్చే క్రషింగ్ సీజన్‌కు అవసరమైన గ్రాంటు ఇవ్వాలి
- రైతులు, కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి
- ఫ్యాక్టరీ కార్మిక సంఘం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న గుర్తింపు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి భాస్కరరావు

చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఆదుకోవాలని ఫ్యాక్టరీ కార్మికుల సమావేశం కోరింది. గోవాడ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సుగర్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ కార్మిక సంఘం సమావేశం బుధవారం నిర్వహించారు. గుర్తింపు యూనియన్ ప్రధానకార్యదర్శి కె.వి. భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అనేక సమస్యలు, ఫ్యాక్టరీ మనుగడ, రానున్న క్రషింగ్ సీజన్‌కు చేపట్టవలసిన చర్యలపై కార్మికులు చర్చించారు. 2024-25 క్రషింగ్ సీజన్‌లో తలెత్తిన అనేక సమస్యలు, ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వానికి తెలియజేసేందుకు రాజకీయాలకు అతీతంగా ఫ్యాక్టరీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వేసిన కమిటీ ముఖ్యమంత్రి చంద్రబాబును, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను, మంత్రి లోకేష్‌ను అనేకసార్లు కలిసి వివరించడం జరిగిందని కార్యదర్శి భాస్కరరావు అన్నారు. ఫ్యాక్టరీని, రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకూ ఎటువంటి సాయం అందలేదన్నారు. మరలా మరోసారి చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలతో కలిసి సీఎం, డిప్యూటీ సీఎంలను, అనకాపల్లి ఎంపీని కలిసి వినతి పత్రం ఇవ్వాలని నిర్ణయించారు. ఫ్యాక్టరీ ఆస్తులను రీ వాల్యుయేషన్ చేయించి ప్రభుత్వ గ్యారంటీతో వడ్డీ లేని రుణాన్ని మంజూరు చేయాలని, 2025-26 రానున్న క్రషింగ్ సీజన్‌కు వర్కింగ్ క్యాపిటల్ నిమిత్తం, ప్రస్తుతం రైతులకు, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించుటకు అవసరమైన నిధులు ప్రభుత్వం మంజూరు చేయాలని సమావేశంలో తీర్మానించింది. వచ్చే సీజన్‌కు ఓవర్ హాలింగ్ పనులు పూర్తిగా చేసి కోజనరేషన్ ఉత్పత్తి కూడా పూర్తిగా జరిగేలా ఫ్యాక్టరీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘం సమావేశంలో కోరింది. ఈ సమావేశంలో సంఘ ప్రతినిధులు బండి శ్రీను, నూకరాజు, అల్లం రామఅప్పారావు, జగన్నాథరావు, సత్యనారాయణ, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

ఎస్పీ తుహిన్ సిన్హా



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

మాకవరపాలెం: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని ఎస్పీ తుహిన్‌సిన్హా పోలీసు సిబ్బందిని ఆదేశించారు. మాకవరపాలెం పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, నేర నియంత్రణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ర్యాగింగ్, మహిళలపై జరుగుతున్న వేధింపులు, గంజాయి, ఇతర మత్తు పదార్థాల తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మహిళా చట్టాలపైన, శక్తి యాప్‌పైన విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో కీలకమని, వీటిపై ప్రజలకు వివరించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను తనిఖీ చేసిన ఎస్పీ సిబ్బందితో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై స్పందించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ సీఐ రేవతమ్మ పాల్గొన్నారు.

రోగి వైద్య సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంటు అధికారి ప్రశాంతి
- జిల్లాలో అన్ని పీహెచ్‌సీలకు సమాచారం
- నాతవరం పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



పీహెచ్‌సీ సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంటు అధికారి ప్రశాంతి

నాతవరం: ప్రభుత్వం నుంచి కొత్తగా వచ్చిన ఆదేశాల ప్రకారం పీహెచ్‌సీలలో వైద్యులు పరీక్షించిన రోగి తాలుకా ఆరోగ్య సమాచారాన్ని విధిగా ఆన్‌లైన్‌లో డిజిటల్ రికార్డు నమోదు చేయాలని జిల్లా ప్రోగ్రాం మేనేజమెంట్ అధికారి (డీపీఎంవో)జె.ప్రశాంతి అన్నారు. మండల కేంద్రంలో గల పీహెచ్‌సీని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న వైద్య సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు చేసిన రికార్డులను స్వయంగా పరిశీలించారు. పీహెచ్‌సీకి రోజు వారీ వస్తున్న రోగుల వివరాలను వైద్యాధికారి ప్రసన్నను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో ప్రధాన సమస్యలు, సిబ్బంది వివరాలు అడిగి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నుంచి కొత్తగా వచ్చిన ఆదేశాల ప్రకారం పీహెచ్‌సీలో రోగికి అందించిన వైద్యం, మందుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆ రోగి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పీహెచ్‌సీలో వైద్యం కోసం వెళ్తే ఆ రోగికి గతంలో ఏవ్యాధి ఉందేది ఏయే మందులు అందజేశారనే పూర్తి సమాచారం ఆధార్ నంబర్ ఆన్‌లైన్‌లో చెక్ చేస్తే తెలుస్తుందన్నారు. డీఎంహెచ్‌వో ఆదేశాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీలకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ప్రసన్న , ఫార్మసిస్టు వెంకటరావు , హెల్త్ సూపర్‌వైజర్లు బైరాగి, వెంకటరమణ పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలి

తుమ్మపాల: విద్యాసంస్థలకు వేసవి సెలవుల దృష్ట్యా జిల్లాలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ ఎం.జాహ్నవి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం తన చాంబర్‌లో వేసవి క్రీడా శిబిరాల క్రీడాకారులకు క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 50 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులందరూ క్రీడా శిబిరాలను వినియోగించుకుని ఆటలలో బాగా రాణించాలని, భవిష్యత్తులో పతకాలు సాధించాలన్నారు. ఆటల వల్ల విద్యార్థుల మనో వికాసం పెరుగుతుందని, ఆరోగ్యం బాగుంటుందని, చదువులో రాణిస్తారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆటలలో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలన్నారు. ప్రతి క్రీడా శిబిరానికి రూ.5 వేలు విలువచేసే క్రీడా పరికరాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎల్.వి.రమణ క్రీడా శిక్షణ శిబిరాల వివరాలు తెలియజేస్తూ జిల్లాలో ఏర్పాటు చేసిన 50 శిక్షణ శిబిరాలకు 982 మంది విద్యార్థుల పేర్లు నమోదు చేసుకున్నారని, వారిలో 612 మంది బాలురు, 370 మంది బాలికలు ఉన్నారన్నారు. వీరికి 20 క్రీడా అంశాలలో శిక్షణ అందిస్తున్నామన్నారు. 8 నుండి 14 ఏళ్ల వయస్సు గల విద్యార్థులలో ప్రతిభావంతులను గుర్తించి వారిని ప్రోత్సహించడం కోసం ప్రతి సంవత్సరం క్రీడా శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. అంతకు ముందు ఇటీవల జరిగిన సివిల్ సర్వీసెస్ ఆటల పోటీల్లో వెండి పతకం సాధించిన ఖోఖో జాతీయ స్థాయి రజత పతక విజేత శ్యామ్ ప్రసాద్‌ను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు కె.త్రిమూర్తులు, రెహమాన్, చిరంజీవి, రమేష్, అచ్చుతాపురం, జిల్లాపరిషత్ పాఠశాల క్రీడా శిబిరం, హరిపాలెం రగ్బీ ఆట శిబిరం, అక్కిరెడ్డిపాలెం క్రీడాశిబిరం విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు క్రీడా పరికరాలు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ జాహ్నవి

క్లుప్తంగా

యుద్ధ వాతావరణం సమసిపోవాలని ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

కశింకోట: దేశంలో శాంతి నెలకొనాలని, భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం సమసిపోవాలని కోరుతూ స్థానిక ఆంధ్ర కల్వరి సెంచురియస్ బాప్టిస్టు చర్చిలో జిల్లాలోని పాస్టర్లు, విశ్వాసులు బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భారత్ సరిహద్దులో ఉన్న సైనికులు, దేశ నాయకులు, ప్రజలు క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. దేశ రక్షణలో అమరులైన సైనికుల కుటుంబాల కు ఓదార్పు కలగాలని ప్రార్థించారు. జిల్లా క్రైస్తవ సమాజం రెవరెండ్ సన్నీ జేమ్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రెవరెండ్ ఏసురత్నం, తిమోతి, పీటర్, సీహెచ్. ప్రకాష్, యోహాను, జాన్సన్, శాంసన్ రాజు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయిల పనులు ప్రారంభం



కొళాయి పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు

అనకాపల్లి టౌన్: మండలంలోని తుమ్మపాల గ్రామంలో ఇందిరానగర్‌లో జల్‌జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన ఇంటింటికీ కుళాయిలు వేసే పనులను గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు బుధవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ బ్యాంక్ మాజీ చైర్మన్ పి.డి. గాంధీ, వార్డు మెంబర్లు ముత్యాల వెంకటలక్ష్మి, ఖండేలా గోవిందమ్మ, తత్ర సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ దీక్షలు



మాలధారణ చేస్తున్న భక్తులు

రావికమతం: హనుమాన్ జయంతి పురస్కరించుకొని మత్స్యవానిపాలెం గ్రామంలో భక్తులు బుధవారం ఆంజనేయ స్వామి దీక్షలు చేపట్టారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 20 మంది భక్తులకు గ్రామ పురోహితులు వేపా ధర్మఫణి ఆధ్వర్యంలో సర్పంచ్ మలిచెట్ల గణేష్, గురుస్వామి సోమిరెడ్డి శివ మాలధారణ చేయించారు. తొమ్మిది రోజుల పాటు కఠినమైన నియమాలు ఆచరించి దీక్ష చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 640 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,400	4,940
రెండో రకం	3,890	4,370
మూడో రకం	3,300	3,710

అనకాపల్లి సినిమాలు

రాజా	: రెట్రో
సత్యనారాయణ స్క్రీన్-1	:శుభం
సత్యనారాయణ స్క్రీన్-2:	జగదీక వీరుడు అతిలోక సుందరి
పర్తిసాయి	:హిట్-3
షిర్డీసాయి	సింగల్
వెంకటేశ్వర	:సీఎం పెళ్లాం
శ్రీ సత్య	: సారంగపాణి జాతకం
రామచంద్ర	:తుడురుమ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 49 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్ 16 యూనిట్లు, బి పాజిటివ్ -10 యూనిట్లు, ఒ పాజిటివ్-14 యూనిట్లు, ఏబీ పాజిటివ్ -3 యూని ట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ య.లోకేష్(ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.



కశింకోటలోని బాలికల హైస్కూలు



పీఎం శ్రీలో నిర్మించిన సైన్స్ ల్యాబ్



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కల్పించిన మౌలిక సదుపాయాలు

ఈ సారీ నిరాశే!

పునర్వ్యవస్థీకరణలో స్థాయి పెంపునకు నోచుకోని హైస్కూల్

నీరుగారిన కళాశాల ఆశలు



బాలికల హైస్కూలు భవనం



విశాలమైన మైదాన ప్రాంగణం

కశింకోట: స్థానిక బాలికల హైస్కూలు పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో ఇంటర్మీడియెట్ (ప్లస్ 2) స్థాయికి నోచుకోలేదు. దీంతో బాలికలు నిరాశకు గురయ్యారు. ప్రధానంగా ఇక్కడ చదువుతున్న స్థానికులతో పాటు అత్యధిక మంది ఏజెన్సీ ప్రాంత విద్యార్థినులు తమకు సరైన కళాశాలలు అందుబాటులో లేక,ఆర్థిక పరిస్థితి వల్ల టెన్త్ తర్వాత మధ్యలోనే చదువుకు స్వస్తి పలకాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇక్కడ ఇంటర్మీడియెట్ ఏర్పాటు కోసం చాలా కాలంగా డిమాండ్ ఉన్నా అందుకు అధికారులుగాని, ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. కశింకోటలో ఉన్న బాలికల జిల్లా పరిషత్ హైస్కూలు మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటైంది. ఇక్కడ మండలంలోనే అత్యధికంగా 650 మందికి పైబడి బాలికలు ఇక్కడ చదువుతున్నారు. ఇక్కడ స్థానికులే కాకుండా ఉమ్మడి విశాఖ జిల్లాలోని చింతపల్లి, పాడేరు, తదితర ఏజెన్సీ ప్రాంతాల నుంచి సుమారు 400 మంది బాలికలు వచ్చి చదువుతున్నారు. తమ ప్రాంతం నుంచి ప్రయాణానికి అనుకూలంగా ఉండడం, నివాసానికి సమగ్ర బాలికల వసతి గృహం స్కూలు పక్కనే అందుబాటులో ఉండటంతోపాటు కశింకోట బాలికల హైస్కూల్లో విద్యాభ్యాసం బాగుంటుండటం, మైదాన ప్రాంత సంస్కృతి, నాగరికత అలవడతాయనే ఉద్దేశం, ఆసక్తితో ఇక్కడ ఏజెన్సీ ప్రాంత బాలికలు ఎక్కువగా చేరుతున్నారు. టెన్త్ పరీక్షలకు ఇక్కడి నుంచి సుమారు 150 మంది బాలికలు హాజరుకాగా, వారిలో 90 మంది ఏజెన్సీ ప్రాంత బాలికలు ఉంటుండడం విశేషం. వారు చదువులోనే కాకుండా ఆటల్లో కూడా రాణిస్తున్నారు. ఈ ఏడాది వసతి గృహంలో చదివే బాలిక రాష్ట్ర స్థాయిలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో టాప్ టెన్‌లో 8వ స్థానంలో నిలిచింది. గతంలో కూడా మండల స్థాయిలో టాప్‌లో నిలిచి బాలికలు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు కూడా పొందారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ఇంటర్మీడియెట్ కూడా ఏర్పాటు చేయాలని చాలా కాలంగా డిమాండ్ ఉంది. సరైన కళాశాలలు అందుబాటులో లేకపోవడం, ఆర్థిక సమస్యలతో టెన్త్ తర్వాత మధ్యలో చదువుకు స్వస్తి చెప్పాల్సిన పరిస్థితిని ఎక్కువగా బాలికలు ఎదుర్కొంటున్నారు. దీనిదృష్ట్యా ఇక్కడ ఇంటర్మీడియెట్ ఏర్పాటు చేస్తే స్థానికులతోపాటు ఏజెన్సీ విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని ఆశిస్తున్నారు. అయితే ఇందుకు 2021లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రయత్నాలు చేశారు. అప్పట్లో తేగాడ వద్ద కస్తూర్బా విద్యాలయాన్ని ఇంటర్మీడియెట్ స్థాయికి పెంచారు. అందువల్ల ఇక్కడ ఇంటర్మీడియెట్ రావడానికి అవరోధం ఏర్పడిందని సమాచారం. అయితే కస్తూర్బా విద్యాలయంలో ఖాళీ ఏర్పడిన పరిమిత సీట్లలో అనాథలు, పాక్షిక అనాథలు, వెనుకబడిన వారు మాత్రమే చదవడానికి అవకాశం ఉంది. అప్పటికే అక్కడ టెన్త్ చదివిన బాలికలకే ఇంటర్మీడియెట్‌లో చేరడానికి ప్రాధాన్యం ఇస్తారు. పైగా అక్కడ బైపీసీ గ్రూపు మాత్రమే నిర్వహిస్తున్నారు. ఇతర గ్రూపుల్లో చేరి చదువుదామన్నా అందుకు అవకాశం లేదు. పైగా సరైన రవాణా సదుపాయం లేదు. మండల కేంద్రానికి ఆరు కిలో మీటర్ల దూరంలో ఉంది. ఈ నేపథ్యంలో ఇక్కడ ఇంటర్మీడియెట్ ఉంటే ఎక్కువ మంది బాలికలు చదువుకోవడానికి అనువుగా ఉంటుంది.

పూర్తిస్థాయి సదుపాయాలు

గత వైఎస్సార్ ప్రభుత్వ హయాం**లో రెండు విడతలుగా** నాడు–నేడు నిధులు **సుమారు రూ.కోటి** మంజూరు చేసి మౌలిక **సదుపాయాలు కల్పించి** అందంగా తీర్చిది**ద్దారు. 3 తరగతి** గదులు నిర్మించారు. **ఏడాది మొదటి** విడతలోనే కేంద్ర **ప్రభుత్వం నిధులు సమ**కూర్చనున్న పీఎం **శ్రీ పథకానికి స్కూలు** ఎంపికైంది. ఈ పథ**కంలో రూ.పది లక్షలు** పైబడి వెచ్చించి **సైన్స్ ల్యాబ్ నిర్మించడ**ంతోపాటు ఖోఖో, **షెటిల్ బ్యాడ్మింటన్,** వాలీబాల్ తదితర కోర్టులను కూడా నిర్మించారు. ఇలా సదుపాయాలు కలిగి ఉన్న పాఠశాలలో ఇంటర్మీడియెట్ ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని విద్యార్థులు తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా బాలికల సౌకర్యార్థం హైస్కూలును ఇంటర్మీడియెట్ స్థాయికి పెంచడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారులకు నివేదించాం

ఇక్కడి హైస్కూలులో 650 మంది బాలికలు వరకు చదువుతున్నారు. ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు 150 మంది పైగా విద్యార్థినులు హాజరు కాగా, వారిలో 90 మంది ఏజెన్సీ ప్రాంతాల వారు ఉన్నారు. ఇక్కడ ఇంటర్మీడియెట్ ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు చాలా కాలంగా కోరుతున్నారు. అధికారులకు నివేదించాం. ఇంటర్మీడియెట్ కోర్సు ప్రవేశ పెట్టడం వల్ల స్థానికులతో పాటు ఇక్కడ ఎక్కువగా చదివే ఏజెన్సీ ప్రాంత బాలికలకు ప్రయోజనకరంగా ఉండగలదు.

– ఎం.ఎస్. స్వర్ణకుమారి, హెచ్‌ఎం ,
బాలికల హైస్కూలు,కశింకోట

కశింకోటకు చేరిన పాఠ్యపుస్తకాలు

కశింకోట: మండలంలోని విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు కశింకోట చేరినట్టు ఎంఈవో కె.ఎస్.ఎన్. మూర్తి బుధవారం తెలిపారు. 1 నుంచి 10 వ తరగతి వరకు 17,987 పాఠ్య పుస్తకాలు వచ్చాయన్నారు. అయితే వీటిలో 7వ తరగతి పుస్తకాలు మారనున్నందున, అవి ఇంకా రాలేదన్నారు. అలాగే 35,114 నోట్ పుస్తకాలు కూడా వచ్చాయన్నారు. వీటిలో వైట్,రూల్, డబుల్ రూల్, గ్రాఫ్ పుస్తకాలు ఉన్నాయన్నారు. వీటిని కశింకోట బాలికల హైస్కూలులో భద్రపరిచినట్టు చెప్పారు. కిట్లు, దుస్తులు అన్ని వచ్చాక విద్యార్థులకు పంపిణీ చేయాలని ఉత్తర్వులు వచ్చినట్టు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటిని పంపిణీ చేయడానికి చర్యలు చేపడతామన్నారు.

భగవద్గీత శ్లోకాలపై అవగాహన



భగవద్గీత శ్లోకాలపై అవగాహన కల్పిస్తున్న నరసింగబిల్లి హెచ్‌ఎం సురేష్‌కుమార్

కశింకోట: భగవద్గీతను మన జీవితానికి అన్వయించుకోవాలని నరసింగబిల్లి ప్రభుత్వ స్కూలు హెచ్‌ఎం సురేష్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పఠనంపై అవగాహన కల్పించారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా 14వ రోజు బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందిస్తాయన్నారు. ప్రతి రోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు, పత్రికలు చదవాలని తెలిపారు. వచ్చే నెల 6వ తేదీ వరకు జరగనున్న విజ్ఞాన తరగతులకు హాజరై కొత్త విషయాలు తెలుసుకోవాలన్నారు. చదువుతోపాటు ఆటలపైన దృష్టి సారించాలని క్రమ శిక్షణతో మెలగాలని చెప్పారు గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవతమ్మ పుట్టుక ఉత్సవం

కశింకోట: స్థానిక గవరపేటలో వెలసిన దేవతమ్మ పుట్టుక ఉత్సవం గురువారం రాత్రి జరగనుందని నిర్వాహకులు తెలిపారు. ప్రతి రెండేళ్లకోమారు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఇక్కడి శారదానది అవతల ఉన్న అమ్మ వారి పుట్ట వద్దకు సంప్రదాయ డప్పులు, వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి పూజలు నిర్వహిస్తారు. అమ్మ వారి ప్రతి రూపాన్ని తీసుకు వచ్చి ఆలయంలో నెలకొల్పి పూజలు చేసి, ఈ నెల 19న అమ్మ వారి ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఉమ్మడి విశాఖ జిల్లా లోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన స్థానిక వేగి కుటుంబీకులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొంటారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



విద్యార్థులను అభినందిస్తున్న మలసాల రమణారావు, పెతకంశెట్టి శివసత్యనారాయణ

అనకాపల్లి: విద్యార్థులు ఇష్టపడి చదివితే సత్ఫలితాలు సాధించవచ్చని జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివసత్యనారాయణ(జోసెఫ్) తెలిపారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 10 మంది విద్యార్థినీవిద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు, నగదును వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు, మాజీ ఆర్‌ఈసీఎస్ చైర్మన్ మలసాల రమణారావు చేతులు మీదుగా బుధవారం పంపిణీ చేశారు. స్థానిక వేల్పులవీధి జీవీఎంసీ బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జోసెఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 83వ వార్డు ఇన్‌చార్జ్ జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉగ్గిన అప్పారావు, గైపూర్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అదుపు తప్పితే కాలువలోకే...



రోడ్‌కు సమాంతరంగా మారిన కాలువ రక్షణ గోడ

అనకాపల్లి టౌన్: మండలంలోని కొప్పాక బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. ఈ బ్రిడ్జి రోడ్డు కాలువకు సమాంతరంగా ఉంది. బ్రిడ్జి పక్కన కాలువకు రక్షణగా ఉండాల్సిన గోడ శిథిలమైంది. బ్రిడ్జిపై పలుదఫాలుగా రోడ్డు వేయడం వల్ల బ్రిడ్జికి రక్షణగా నిర్మించిన గోడ కనిపించడం లేదు. దీనివల్ల అటుగా వెళ్లే వాహనాలు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉంది. తక్షణమే కాలువ వద్ద రక్షణగా ఎత్తైన గోడను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

20న జీవీఎంసీ కార్మికుల సమ్మె



జీవీఎంసీ కార్మికుల సమ్మె పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

అనకాపల్లి టౌన్: జీవీఎంసీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20న సమ్మె చేయనున్నట్టు జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గంటా శ్రీరామ్ తెలిపారు. స్థానికంగా జరిగిన కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోకాడ దేముడు నాయుడు, జీవీఎంసీ యూనియన్ నాయకుడు నిమ్మకాయల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

గందరగోళంగా పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ

కశింకోట: ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ గందరగోళంగా తయారైందని విమర్శలు వస్తున్నాయి. మండలంలో 59 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో మూడు ప్రాథమికోన్నత పాఠశాలలను ఎత్తివేసి ప్రాథమిక పాఠశాలల స్థాయికి కుదించారు. ఒక ప్రాథమిక పాఠశాల మూతపడింది. మిగిలిన పాఠశాలల్లో మూడు మినహా మిగిలిన 55 పాఠశాలల్లో మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయి. ఇది విద్యార్థులు, తల్లిదండ్రులను గందరగోళానికి గురిచేస్తోంది. మండలంలో నాలుగు ప్రాథమిక పాఠశాలలను విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఆదర్శ పాఠశాలలుగా ఏర్పాటు చేశారు. కశింకోట బాలికల ప్రాథమిక పాఠశాల, కశింకోట 6వ ప్రాథమిక, జమాదులపాలెం,నరసింగబిల్లి ప్రాథమిక పాఠశాలలను ఈ ఏడాది నుంచి 1 నుంచి 5వ తరగతులు నిర్వహిస్తారు. వీటిలో నరసింగబిల్లి వినహా మిగిలిన పాఠశాలల్లో 1 హెచ్‌ఎం, నలుగురు ఉపాధ్యాయులుంటారు. నరసింగబిల్లి పాఠశాలలో మాత్రం హెచ్‌ఎం, ముగ్గురు ఉపాధ్యాయులుంటారు. 13 ప్రాథమిక పాఠశాలలను ఫౌండేషన్ స్కూళ్లుగా మార్పు చేశారు. కశింకోట 1,3,5 ప్రాథమిక పాఠశాలలు, వెదురుపర్తి, బయ్యవరం 1,2, తాళ్లపాలెం 2,4 పాఠశాలలు, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, కన్నూరుపాలెం, పాత కన్నూరుపాలెం ప్రాథమిక పాఠశాలలు ఫౌండేషన్ స్కూళ్లుగా కొనసాగనున్నాయి. వీటిలో 1,2 తరగతులను నిర్వహిస్తారు. 20 మంది విద్యార్థులుంటే ఒక ఉపాధ్యాయుడు, అంతకు మించి 60 లోపు విద్యార్థులుంటే రెండో ఉపాధ్యాయుడు ఉంటారు. మిగిలిన 28 ప్రాథమిక స్కూళ్లను బేసిక్ స్కూళ్లుగా మార్పు చేసి వాటిలో 1 నుంచి 5 వరకు తరగతులు నిర్వహించనున్నారు. ఆనందపురం పాఠశాలను విద్యార్థులు లేక మూసివేశారు. ఉగ్గినపాలెం, అచ్చెర్ల, జి. భీమవరం ప్రాథమికోన్నత పాఠశాలలను ప్రాథమిక పాఠశాలల స్థాయికి కుదించారు. ఇక పది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలుండగా, వాటిలో ఏఎస్‌పేట హైస్కూలు మినహా మిగిలిన వాటిలో గతంలో 3 నుంచి పది తరగతుల వరకు నిర్వహించే వారు. ఇప్పుడు చెరో 5 హైస్కూళ్లలో వేర్వేరు కొత్త విధానం అమలు చేస్తున్నారు. కశింకోటలోని డీపీఎన్ జెడ్పీ హైస్కూలు, బాలికల హైస్కూలు, జమాదులపాలెం, ఏఎస్‌పేట, నరసింగబిల్లి హైస్కూళ్లలో ఇక నుంచి 6 నుంచి పది తరగతులు నిర్వహిస్తారు. ఇక్కడ ఉండే 3,4,5 తరగతులను సమీపంలోని పాఠశాలల్లో విలీనం చేశారు. అలాగే తాళ్లపాలెం, కన్నూరుపాలెం, కొత్తపల్లి, వెదురుపర్తి, బయ్యవరం హైస్కూళ్లలో 1 నుంచి పది వరకు తరగతులు నిర్వహిస్తారు. అలాగే ఆయా పాఠశాలల్లో ప్రాథమిక తరగతులు కూడా నిర్వహించడం వల్ల కొత్తపల్లి, వెదురుపర్తి, తాళ్లపాలెం, బయ్యవరంలో వాటి పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయే అవకాశం ఉందని, దీనివల్ల రానున్న కాలంలో ప్రాథమిక పాఠశాలల మనుగడ సాగించడం కష్టమని విమర్శలు వినిపిస్తున్నాయి. పక్కనే ప్రాథమిక పాఠశాలలుండగా, హైస్కూళ్లలో కూడా ప్రాథమిక తరగతులు నిర్వహించడమేమిటంటున్నారు. అలాగే కన్నూరుపాలెం, పాత కన్నూరుపాలెం ప్రాథమిక పాఠశాలల్లో గత ఏడాది ఒక్కొక్క విద్యార్థి మాత్రమే చదివారు. అయితే ఆ పాఠశాలలను కూడా కొనసాగిస్తూ ఊరికి దూరంగా ఉన్న హైస్కూలులో ప్రాథమిక తరగతులు నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది. దీనివల్ల ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారనుందని విమర్శిస్తున్నారు. ఇక తేగాడలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం, మోడల్ స్కూలు, తాళ్లపాలెంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల్లో మాత్రం ఎటువంటి మార్పులు చేయకుండా యథావిధిగా కొనసాగనున్నాయి.

ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో అవకతవకలను అరికట్టాలి

అనకాపల్లి టౌన్: పౌరసరఫరాల శాఖ మండల స్థాయి స్టాక్(ఎంఎల్‌ఎస్) పాయింట్‌లో జరిగే అవకతవకలను తక్షణమే అరికట్టాలని రూరల్ రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మళ్ళ నారాయణ రావు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. గోదాం వద్ద తూకాలలో తేడా వస్తోందని పేర్కొన్నారు. దీనివల్ల డీలర్లు నష్టపోతున్నారని తెలిపారు. తక్షణమే ఈ సమస్యపై జాయింట్ కలెక్టర్ దృష్టి సారించాలని ఆయన కోరారు.

మైనర్లు వాహనాలు నడపడం నేరం



మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ

అనకాపల్లి టౌన్: మైనర్లు వాహనాలు నడపడం నేరమని పట్టణ ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ తెలిపారు. పట్టణంలోని బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, ద్విచక్ర వాహనాలు నడుపుతున్న బాలురుని పట్టుకుని, వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేనిదే వాహనాలకు పిల్లలకు ఇవ్వరాదన్నారు. అపరాధ రుసం విధించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ శేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామికి పూలంగి సేవ

సందడిగా స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు



స్వామివారికి పూలంగి సేవ చేస్తున్న అర్చకులు

చోడవరం: స్థానిక ఆపదహర శ్రీనివాస క్షేత్రంగా బాసిల్లుతున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు కన్నులపండువగా బుధవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి రాత్రి కన్నులపండువగా పూలంగి సేవ చేశారు. పలు రంగుల పువ్వులతో స్వామివారి పూల పాన్పును తయారు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన వేంకటేశ్వరస్వామివారి ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించి, పూలంగి సేవ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శాంతారామాచార్యులు, వాసు ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోచ్చరణ మధ్య పూలంగి సేవ వైభవంగా జరిగింది. గ్రామంలో మహిళలు పెద్దసంఖ్యలో పూలు, పండ్లు తెచ్చి స్వామివారికి సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ వింజుమూరి శంకర్, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉపాధ్యాయుల శ్రీనివాస్ పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

నర్సీపట్నంలో కుండపోత వర్షం



మెయిన్ రోడ్డుపై చేరిన వర్షం నీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

నర్సీపట్నం : నర్సీపట్నంలో మధ్యాహ్నం కుండపోతగా వర్షం కురిసింది. రెండు రోజులుగా కాసిన ఎండలకు ప్రజలు బెంబేలెత్తారు. ఉక్కపోతతో అల్లాడారు. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడి ప్రతాపానికి జనం విలవిలాడారు. ఒక్కసారిగా వాతావరణ చల్లబడి, ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. దీంతో జనం ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందారు. కుండపోత వర్షానికి పట్టణంలో ప్రధాన డ్రైనేజీ పొంగి వర్షపు నీరు మెయిన్‌రోడ్డుపై ఏరులై పారింది. ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి వద్ద మెయిన్ కల్వర్టు కూరుకుపోవడంతో వర్షం నీరు మెయిన్‌రోడ్డుపై చేరి చెరువును తలపించింది. వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.